# మమత

పిల్లలులేనివారే అందరి పిల్లలనీ సమానంగా ప్రేమించ గలుగుతారు; పిల్లలున్నవారికి తమ పిల్లలంటేనే ఎక్కువ; లేనివారికి ఎవరిపిల్లల్ని చూసినా ముద్దే! నిస్వార్థమైన మాతృ మూర్తులు పిల్లలులేని స్త్రీలే సుమీ - అంటాడు రాజారావు, కాని, నీరద తనలో ఏదో లోపం వుండటంవల్లనే 'శీల' తన వద్దనుంచి వెళ్ళిపోయిందనుకుంటుంది. కొండలమీది నీలి నీడలే ఆమె హృదయాందోళనని శాంతింపజేయాలి.

శీల నిన్ననే వెళ్ళిందట!

రాజారావు కోటు విప్పి హేంగర్‌కి తగిలించుకుంటూ' పాలరాతి శిల్పంలా నిలబడ్డ నీరదని చూసి అన్నాడు. నీరద భర్తతో ఒక ముక్కన్నా అనకుండా గిరుక్కుమని వెనక్కి తిరిగి డైనింగ్ హాలులోకి వెళ్ళిపోయి, నిశ్శబ్దంగా టేబులు మీద ప్లేట్లూ గిన్నెలు సర్ది తమిద్దరికీ, వండినవంటకాలు వడ్డించింది. రాజారావు కాళ్ళూ, చేతులూ, ముఖమూ, కడుక్కుని వచ్చి, కుర్చీలో కూర్చుని, నీరదకేసి చూసాడు. నీరద తప్పుచేసిన దాని మల్లె, తల వొంచుకుని, నిశ్శబ్దంగా అన్నం కలుపుకుంటోంది. ఆకాశ సదృశ నిస్తబ్దతకి కాస్త చలించాడు రాజారావు. లేనిపోని బాంధవ్యాలకి ఆరాట పడుతూన్న, నిరీహానీరదని చూస్తే అతనికి జాలీ, కుప్ప తిప్పలుగా అపేక్ష వెల్లువ పొంగుకు వచ్చింది.

'చూడు! అనవసరంగా ఖేదపడకు! శిలకి, స్త్రీమాను రాగాలతో పెరిగే అదృష్టం లేదు. అంతే!' లాలనగా అన్నాడు.

'లేదు, లేదు. నాలో ఏదో లోపం వుంది. అది ఏమిటో నేనే తెలుసుకోలేకుండగా వున్నాను. నానించి ఏదో బాధలేకుండగా వుంటే, వాళ్ళెందుకు నానించి దూరంపోవాలని చూస్తారు! ఇంక మీరు నానించి ఏమీ దాచకండి!' తళ తళ్ళాడే విశాలనేత్రాల్లోంచి, స్ఫటికాలు చెంపలమీదకి జారుతోండగాఅంది నీరద. రాజారావు మాట్లాడలేకపోయారు. ఓదార్చిన కొద్దీ జ్ఞాపకాల తెరలు ఇంకా ఉధృతంగా ఎగురుతాయి! రాజారావు మౌనంగా భోజనం చేశాడు. లేచి, కోటు వేసుకుని వెళ్ళబోతూ :

'ఇవ్వాళ కాంపుకి వెళ్తున్నాను. పెందరాళే భోజనం చేసి పడుక్కో' అన్నాడు. భరించలేని ఉద్వేగంలో వున్న నీరదని రెండురోజులు ఒంటిగా వుండనీయటం మంచిదనిపించింది రాజారావుకి. అంచేత ప్రొద్దుట సహోద్యోగి వెళ్ళవలసిన కాంపు తను తీసుకున్నాడు.

భర్త వెళ్ళినాక నెమ్మదిగా, వంటింట్లోకి నడిచింది నీరద. నాలు గయిదు రకాల తీపి సరుకులు నింపిన స్టీలు కారియర్ వెక్కిరింతగా చూసింది నీరద వెంపు. నీరద గబగబా ముఖం త్రిప్పుకుని, తన బెడ్ రూంలోనికి వచ్చింది. మంచం మీద, టైలర్ ఆవేళ ఉదయమే కుట్టి తెచ్చిన, నాలుగు సిల్కు-

పావడాలూ, నాలుగు జార్జెటువోణీలు, నాలుగు జాకెట్లూ బొత్తిగా పెట్టివున్నాయి. నీరద వాటికేసి నిర్వేదంగా చూసి నిట్టూర్చింది వెళ్ళేముందయినా చెప్పటానికి, రాకపోతుందా అని నాలుగు జతల బట్టలు కుట్టించి 'శీల' కిష్టమయిన తీపి సరుకులు చేసి అట్టేపెట్టింది. అంత వెళ్ళేముందయినా ఒక్క-సారి కనపడి చెప్పకూడనంతటి, అపకారం తనేం చేసింది! 'శీల' అంటే తనకి ఎంత ప్రేమో ఎలా చెప్పడం? నీరదకి కళ్ళమ్మట నీళ్లొచ్చేయి.

నీరదకి పెళ్ళయి పది సంవత్సరాలు అయ్యింది.కళ్ళల్లో పెట్టుకుని పూజించే భర్త సాన్నిహిత్యంలో పదిసంవత్సరాలూ పూలరేకల్లా రాలిపోయాయి. కాని నీరద కడుపు ఫలించలేదు. నీరదకి తన సుసంపన్న జీవనరాగా లాపనలో నిస్సంతానత, అపశృతిలా అనిపించేది. అప్పుడప్పుడు రాజారావుతో అనేది. పోనీ ఎవరైన చక్కని పాపని పెంచుకుందామండీ అని.

'ఎందుకు లెద్దూ! అదొక యాతనా! పిల్లల్లేనిపెంటా వానలేని వరదా ఎవరిక్కావాలి? ఎంత ప్రేమగా మనం చూసినా, ఎరువుసొమ్ము, స్వంతమవుతుందా? అసలు పిల్లలే ఈ రోజుల్లో స్వతంత్రులైనాక తల్లీ తండ్రీ వుంటే వాళ్ళొక బర్డెన్గా ఫీలవుతున్నారు. ఇంక పెంపకపు తల్లితండ్రులని చూసే దెవరు? వున్నన్నాళ్ళూ హాయిగా నిన్ను నేనూ, నన్ను నువ్వూ చూచుకుంటూ కూర్చోవచ్చును- అనేవాడు. రెండుమూడు సార్లు మురిపెంగా నీరద అడిగినప్పుడు, ముచ్చ

టగా మాటలు చెప్పి, తనకి పెంపకం ఇష్టం లేదన్నట్లు తేల్చి చెప్పాడు రాజారావు. కొన్నాళ్ళు నీరద ఒంటిగా దీర్ఘంగా ఆలోచించింది. రాజారావు చేస్తోన్న వుద్యోగం మాట్లాడితే వూర్లు వెళ్ళాల్సిన వుద్యోగం' నెలకి ఇరవయిరోజుల కాంపులో వుండే భర్తకి పిల్లలులేని లోటు లోటుగా తట్టకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదనుకుంది. ఎటొచ్చీ వంటరి తనం బాధిం చేది తమ ఇరువురిలో, తననే అని నిర్ధారించుకుంది. నీరద అక్కడ్నించీ ఈవంకా, ఆవంకా పెట్టి తమ దగ్గిరి బంధువుల పిల్లల్ని తన దగ్గర అట్టేపెటుకునేది. నీరదకి ఎక్కువగా ఆడ పిల్లలంటే సరదాగావుండేది. ఏ పిల్లలు వచ్చినా రెండు మూడు నెలలు వుండేసరికి, వాళ్ళకి తోచక వెళ్ళిపోయేవారు. పదేసిమంది పిల్లల మధ్య వుండే ఆ పిల్లలు నీరద ఇంట్లో వుండే వంటరితనాన్ని భరించలేక పోయేవాళ్ళు. నీరద తన అమృత హృదయంతో ఆ పిల్లల్ని ఎంత అపేక్షగా చూసినా ఆ పిల్ల లకి నీరద మంచితనంలో వాస్తవికత కన్పించేదికాదు. ఏదో తెచ్చిపెట్టుకున్న ప్రేమలా అన్పించేది.

నీరద పెదతాతయ్యగారి మనుమరాలు శీల ఫోర్తుఫారం చదువుచుండగాతీసుకవచ్చింది నీరద. శీల చూటానికి ముద్దుగా వుండేది. నీరద తెచ్చిన అందరిఅమ్మాయిలకన్న శీల ఎక్కువ అందంగా నీరదవద్ద, ఎక్కువ చనువుగా వుండేది. 'శీల'కి ఏది కావాలంటే అది నిముషాలమీద అమరించేది నీరద. ఒక సంవత్సరం గడిచేసరికి నీరద, శీల ఇంకో అమ్మకన్న కూతురు

అన్నమాట మరిపింపచేసింది. 'శీల' పొరపాటునైనా అమ్మ గురించికాని, నాన్నగురించికాని, అక్కచెల్లెళ్ళ గురించి కాని తలచేది కాదు నీరద 'శీల'ని చూస్తూ తనకి పిల్లలు లేరనే చింత మర్చిపోయింది. ఇంత ఎక్కువ కాలంవున్న అమ్మాయి శీలే అవడంచేతకూడ నీరద 'శీల' మీద గట్టిగా నమ్మకం పెట్టుకుంది.

సరదా వున్నప్పుడు నీరద, శీలా, కారుమీద 'శీల' వాళ్ళ అమ్మగారింటికి వెళ్ళి వస్తూండేవారు అంచేత 'శీల'కి తాను పరాయి వాళ్ళింట్లో వున్నట్లు భావన వచ్చేది కాదను కుంది. నీరద, రెండు సంవత్సరాలు గడిచేయి. 'శీల' మెట్రిక్ పాసయ్యింది. బాగా నీరదంత పొడుగునా ఎదిగింది శీల నీరద ప్రక్కన నడుస్తూంటే, నీరదకి శీలంటే చెప్పలేనంత అపేక్ష నిండుకొచ్చేది. మెట్రిక్ పరీక్షా ఫలితాలు తెలిసిన్నాడు, నీరద హృదయం అవధుల్లేని సముద్ర కెరటాల్లా ఉప్పొంగి పోయింది. 'శీల' కి స్వయంగా తలరుద్ది, సాంబ్రాణి, పొగ వేసి, జుట్టు చిక్కుతీసి రెండు పాయలుగా కట్టింది. వంటింట్లో కూర్చుని పులిహోర, కొబ్బరినవుజు చేయటానికి ప్రయత్నాలు చేస్తోంది. మధ్యాహ్నం, ఇంటి పక్కనున్న వారిని తమఇంట్లో అద్దెకున్న వారినీ పిలిచి చిన్నపార్టి ఇద్దామనుకుంది. రాజారావు వంటింటోకి వచ్చాడు.

'ఏం చేస్తున్నావ్!' అన్నాడు.

స్పెషల్స్ గురించి అడుగుతున్నాడు అనుకొంది!

పులిహోరా కొబ్బరి నవుజూ మధ్యాహ్నం, మిక్స్చరూ అలూ, కేక్సూ, చేద్దామనుకుంటున్నాను - అంది.

అవి కూడా ఇప్పటి వండలోనే చేసెయ్యి, మెయిల్‌కి శీల వెళ్తుందట-అన్నాడు రాజారావు.

ఎక్కడికి ?-ఆశ్చర్యంగా అంది

వాళ్ళ అమ్మానాన్న వాళ్ళ పెద్ద అన్నయ్యగారి వద్దకి వెళ్ళారుటకా ! అక్కడికే తనూ వెళ్తానంది. అని బయటికి వెళ్ళిపోయాడు.

శీల అమ్మా నాన్న. వాళ్ళ పెద్దకొడుకు దగ్గరికి నెల్లూరు వెళ్ళారుట. ఎటొచ్చీ వారం రోజుల్లో వాళ్ళూ తిరిగి రానే వొస్తారు. ఇంతలో ఈమె వెళ్ళటం ఎందుకని నీరద ఆలోచిస్తోనే వంట పూర్తిచేసింది. శీల, వుత్సాహంగా అటూ ఇటూ తిరుగుతూ. తన బట్టలూ, అన్నీ, సర్దుకోసాగింది. శీల ఉత్సాహం, గమనించిన నీరద శీల ప్రయాణాన్ని ఆపటానికి సాహసింపలేక పోయింది. కాని వెళ్ళిపోతుందంటే ఆమెలో ఒక విధమైన నిస్సహాయత విలపించటం మొదలెట్టింది తన లోని జీవనాడు లన్ని పటపట తెగిపోతున్నంత యాతన అనుభవించింది. పైకి నిశ్శబ్దంగానే 'శీల'ని స్టేషను వరకూ వెళ్ళి సాగనంపి వొచ్చింది.

పిచ్చిపిల్ల ! కళ్ళ నిండా నీళ్ళు నింపుకుని మా అమ్మ వద్దకి వెళ్ళాలనుంది, బాబాయ్ ! అని అడిగింది. జాలేసింది. నీరూ ! ఎంత మనం ప్రేమగా చూసినా, పిల్లలకి, వాళ్ళ కష్ట సుఖాల్లో తల్లి దండ్రులవద్ద వుండాలని వుండదా ? అన్నాడు రాజారావు

కన్నీళ్ళు నింపుకుందా ? శీల ? ఎందుకని ? తన కెక్కడ

కర్మ స్వతంత్రం లేదా? ఏ విషయంలో తను లోటు చేసిందని? ఇదే పైకి అంది నీరద.

మనం ఏమీ లోటు చెయ్యలేదనుకోవటం మన భ్రమ అవుతుంది. నీరూ? మనకి డబ్బువుండి పిల్లలు లేరు కనుక మన డబ్బు ఇతరుల పిల్లల సుఖ సౌభాగ్యాలకి వినియోగించక ఎల్లానూ తప్పదు. కాని ఆ పిల్లలు మన పిల్లల్లే వుండాలనుకోవటం మన దురాశే అవుతుంది. మనం ఎంత పెట్టి ప్రేమలు ఒలకపోసినా, అవి వాళ్ళ పట్ల కృత్రికంగానే కనిపిస్తాయి. ఎక్కడో అక్కడ, ఎప్పుడో అప్పుడు, అదే వాళ్ళ పిల్లలయితేనా, అనుకునే పరిస్థితి మనం సృష్టించకపోయినా వాళ్ళు సృష్టించుకుంటారు-అన్నాడు.

మీరు శీల' వెళ్ళిందని అంటున్నారు. చిన్న పిల్ల! పరీక్ష ప్యాసు అయింది. అమ్మానాన్న కొత్తపట్నం వెళ్ళారు. తనూ ఓసారి ఆ వూరు చూడాలనే ఉబలాటంలో వెళ్ళానంది. కాని శీలకి నేనంటే ఆత్మీయతవుంది. సాధారణంగా, సెలవుల్లో ప్రతీ చదువుకునే పిల్లలూ హాలీ డేస్ ఎంజాయ్ చెయ్యాలని కోరుకుంటారు. అల్లానే 'శీల' కీ కోరిక కలిగి వెళ్ళింది. దానికి ఇంత అర్థం తీసి, నే చెప్పేటికీ, ఎవ్వరికీ, అమ్మని కాలేనని నిరూపించదల్చుకున్నారు: అన్నది కోపంగా నీరద.

ఛ ఛ! ఎంత మాటన్నావు నీరూ? నువ్వెందుకు అమ్మవి కాలేవు? నిజానికి పిల్లలు లేనివాళ్ళే అందరి పిల్లలనీ సమానంగా ప్రేమించగలుగుతారు. పిల్లలున్న వాళ్ళకి తమ పిల్లలంటేనే మక్కువగా వుంటుంది. లేనివాళ్ళకి ఎవళ్ళ పిల్లల్ని చూసినా ముద్దుగా వుంటుంది. నిస్వార్థమైన మాతృమూర్తులు

పిల్లలులేని స్త్రీలే! వాళ్ళ హృదయంనిండా పీయూషంలా జలజలూరుతూ వుండే మాతృభావాన్నించి, ఆ స్త్రీలు, ఎన్నటికీ తప్పుకోవాలని చూడరు. ప్రేమగా ఉద్వేగంగా అన్నాడు రాజారావు

కాని నలుగురిలో పిల్లలు గల తల్లికి వున్న గౌరవం, పిల్లలులేని స్త్రీకి వుంటంలేదు కా! దానికేం పిల్లాజెల్లా! అంటూ పిల్లలులేని వాళ్ళని ప్రతీదానికీ తీసిపారేస్తారు. 'పేరంటాలకి వెళ్ళితే ముందు పిల్లలు గల తల్లులకి తాంబూలమిచ్చి సత్కరిస్తారు. వేదనగా అంది నీరద

అది మీలో మీరే సృష్టించుకున్న అజ్ఞానపద్ధతి - అన్నాడు రాజారావు

తన తల్లీ తండ్రితో తిరిగి వూరికి వచ్చింది శీల. రాగానే తమవద్దకి వస్తుందని, పి. యు. సిలో ఏ గ్రూపు తీసుకోవాలో తననే అడుగుతుందనీ అనుకుంది. కాని శీల తనకు తానుగా తిరిగి రాలేదు. ఒక వారం రోజులు ఆగింది నీరద. ఇక ఆగలేక, తనే ఒకసారి 'శీల' వాళ్ళింటికి వెళ్ళింది నీరద. వెళ్ళేసరికి శీల తనఅన్నగారి పిల్లలతో కలిసి, సినిమాకి వెళ్ళింది. నీరద శీల తల్లితోనూ తండ్రితోనూ కబుర్లు చెప్పింది. తిరిగి ఇంటికి వచ్చేయబోతూ: రేపు శీలని మా ఇంటికి పంపెయ్యండి. ఇంక కాలేజీలు తీస్తారు. అప్లికేషన్స్ అవీ పెట్టాల్సివుంటుంది. బయాలజీ గ్రూప్ తీసుకునే మాటుంటే కొంచెం రెకమెండ్ చేయించాల్సి వుంటుందన్నారు వాళ్ళ బాబాయిగారు. ఇంకా బట్టలూ అవీ దానికి నచ్చినవి తీయాలి. ఇంక కాలేజీ గర్ల్ అవబోతుంది కా! అంది నీరద, శీల తల్లి కొంచెం చిన్నబుచ్చు

కుంది. నీరద అంత అభిమానంగా మాట్లాడుతోంటే తానేమని జబాబు ఈయాలా అని ఆలోచించింది.

అది ఇంక చదువుకోను అందమ్మా! ఏదో మాకు తగ్గ సంబంధం చూసి పెళ్లి చేయాలనుంది. మా కోడలి దగ్గరి బంధువుల అబ్బాయి వున్నాడట. అట్టే కట్న కానుకలు వాంఛించరని మా కోడలు చెప్పింది. అంచేత, రేపు వాళ్ళు వెళ్ళేటప్పుడు వాళ్ళతో తీసుకెడతారట! ముక్తసరిగా అంది. నీరద ఏమీ అనలేకపోయింది. శీల తల్లి మాకుతగ్గ సంబంధం అంటుం, పెళ్లివారు కట్నంకానుకలు కోరరు అని అంటంతో ఆవిడ, తమకు శీల మీద గల అప్యాయతని, ఎంత దూరం తరిమేసిందో సులభంగానే అర్థమయింది నీరదకి. వెళ్ళేముందు ఒకసారి పంపించండి! అనేసి కారెక్కేసింది. నా పిల్లకాదు. నీరా. నీ పిల్లే! అని ప్రేమగా అందించ్చిన ఆమె నేడిలా ఎందుకని మారిపోయిందో అర్థం కాలేదు. నీరదకి చక్కగా డాక్టరు కోర్సు చదివిద్దామనుకుంది ఆ పైన పెద్ద ఆఫీసరుకిచ్చి గ్రాండుగా పెళ్లి చేద్దామనుకుంది. తను శీలకి పెళ్లి చేయలేదనుకున్నారా? ఎందుకు వాళ్ళు అధార్తుగా శీలని, తననించి, వేరుపరుస్తున్నారు? రాజారావుకీ ఈ సమస్య సమస్యగానే వుంది. శీలని తను కన్నపిల్లలా చూచేరు కావల్సినవన్నీ కొన్నారు. చదువు చెప్పిద్దామనుకున్నారు. అంత వేగిరం పెళ్లి చెయ్యాలనుకుంటే ఆ ముక్కే తమతో చెప్పొచ్చుగా? బోలెడు కట్నం ఇచ్చి మంచి స్థితిమంతుల సంబంధం తాము తేలేకపోయారా?

ఈ పెళ్లికి శీల వప్పుకోదనీ, తమ దగ్గర వుండి చదువుకుంటానని, పేచి పెట్టుందనీ అనుకుంది నీరద, తమ ఇంట్లోని వైభోగాలు నాలుగేళ్లు, ఏకంగా అనుభవించింది కదా ! చూసి చూసీ, ఈ భాగ్యవాతావరణాన్ని వదులుకోని, మామూలు వాతావరణంలో ఎల్లా కలుసుకుపోతుంది 'అని ధీమాగా వుంది లోపల.

'శీల'కి మళ్ళీ నీరద దగ్గర వుండి, చదువుకోవాలనిపించలేదు. ఆ దుర్భర నిశ్శబ్దంలోంచి ఒక్కసారి తన మామూలు అమ్మా నాన్న, అన్న వదినల మధ్య పిల్లల కీచులాటల మధ్యవున్న గొడవల్లోకి రాగానే, తను ఇన్నాళ్ళూ ఒక ప్రాణంలేని బొమ్మలా గడిపిందా అన్న వూహవచ్చింది. ఇంత ఆహ్లాదకరమైన జీవనకాంతినించి, ఆ నిర్జీవనై రాశ్యంలోకి వెళ్ళిపోవటం ఆమెకి నచ్చలేదు ఎంతసేపూ, పుస్తకాలూ, సోఫాలూ, వింత అలంకరణలూ, ఆత్మీయతని గూర్చిన అస్వాభావికపు మాటలూ, శీల చిన్న హృదయాన్ని ఆకర్షింపలేకపోయాయి. ఇంక నేను వెళ్ళను. అమ్మా ! అని తల్లి దగ్గర బావురుమంది శీల.

ఏం ! పిన్ని బాగా చూసేది కాదా ! అంది, తల్లి. ఛ, తప్పమ్మా ! దేవతలా చూసేది. కాని, ఆవొంటరితనం నేను భరించలేను ఇంత మందిని పోషిస్తున్న మీకు నేను బరువా ! ఆ భోగభాగ్యాలు నాకు వద్దు ! నేను మీతో పాటే వుంటాను. అనేసింది శీల.

శీల రాకపోయే సరికి, రాజారావుని పంపింది నీరద. అంతగా చదువుకుందుకు ఇష్టపడకపోతే, ఆ పెళ్ళిభారం తమ

మీదే వెయ్యమనీ, మంచి సంబంధం తెస్తామనీ భర్త ద్వారా చెప్పి పంపింది. రాజారావు వచ్చి శీల నిన్ననే వెళ్ళిపోయిందని చెప్పేసరికి, నీరదకి ఆశ్చర్యం వేసింది. దానితో ఇన్నిరోజులుగా పెంచుకున్న మమతానుబంధం తెగిపోయింది.

నీరద, తమ గది కిటికీలోంచి దూరంగా కొండలకేసి చూస్తూ నించుంది. ఆకాశంమీద మబ్బులు పరుగెట్టుతోంటే నీరెండలో పచ్చ పచ్చగా మెరుస్తూన్న కొండలమీద, నీలి నీలిగా నీడలు పరుగెట్టుతున్నాయి. ఆ నీడలని తమలోనికి శాశ్వతంగా పొదుపుకుందామన్నంత ఆత్మీయతగా ఆకొండలు మబ్బులున్న కదలకుండా వుండమంటూ వాట్లకేసి గట్టిగా ధృఢంగా చూస్తున్నాయి. ఆ తిక్క మబ్బులకి స్థిరత ఎక్కడుంటుందీ?

నేను అమ్మని కాలేను. ఎప్పటికీ ఎవ్వరికీ కాలేను. ఎవ్వరూ నావద్ద స్థిరంగా వుండలేరు అనుకుంది. అమ్మా! అన్న పిలుపుకి వులిక్కిపడింది నీరద. వెనక్కి తిరిగింది పదేళ్ళ పసిపిల్ల నించుని వుంది. మీ అయ్యేడే! అంది.

ఇయ్యాల తలనొస్తావుందంట! రా లేదుటండి, నా కే సెయ్యమండి అంట్లు అంది ఆ పిల్ల.

పదేళ్ళపిల్లదివుంటే తల్లి కెంత హాయిగా వుంటుంది! అనుకొంటూ ఆ పిల్లకి అంట్లు పడేయటానికి భారంగా లోపలికి నడిచింది నీరద—అమ్మ కాలేని, నీరద.

* * *